సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 21 । మే । 2023



శాత్రాజ్‌పల్లికి తారురోడ్డు

గిరిజనుల నడక కష్టాలు తీరనున్నాయి. ఏళ్లకాలంగా ఇబ్బందులు పడుతూ మైళ్లకుమైళ్లు నడిచిన ప్రజలకు ఊరట లభించనుంది. 8లో



చట్టాలపై అవగాహన ఉండాలి

అసంఘటిత రంగ కార్మికులు హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అర్చన్ అన్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం 41.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత అధికమవుతుంది.

రంగినేని కెరటాలు

సండే స్పెషల్

- అమ్మానాన్నలను కోల్పోయినా ట్రస్ట్ ఒడిలో ఒదిగి.. ఉన్నతంగా చదివి
- దేశ విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడి.. స్ఫూర్తిగా నిలుస్తున్న యువత

బాల్యం అమూల్యమైంది. అమ్మానాన్న ఒడిలో ఆనందంగా గడపాల్సిన సమయమది. కానీ.. పసిప్రాయంలోనే కన్నవాళ్లకు, అయినవారికి దూరమయ్యారు. ఇందులో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన వారు కొందరైతే.. వివిధ కారణాలతో అమ్మ ఆప్యాయతకు, నాన్న అనురాగానికి నోచుకోని బాల్యం మరికొందరిది. తమ భవిష్యత్ ఏంటని ఆలోచన చేస్తున్న వారికి ఆ ట్రస్టు నీడగా నిలిచింది. చదువు చెప్పించింది. కడుపునిండా అన్నం పెట్టింది. ఉండడానికి ఆశ్రయాన్నిచ్చింది. ఆ ఆశ్రయాన్ని ఆసరాగా చేసుకుని అందనంత ఎత్తుకు ఎదిగారు ఆ చిన్నారులు. రంగినేని సుజాత మోహన్‌రావు చారిటబుల్ ట్రస్ట్‌లో చదివిన 55మంది వివిధస్థాయిల్లో.. హోదాల్లో దేశవిదేశాల్లో స్థిరపడ్డారు. ఉన్నతంగా స్థిరపడి 'రంగినేని కెరటాలు'గా పేరు పొందారు. - సిరిసిల్ల



రంగినేని ట్రస్ట్ పూర్వ విద్యార్థులు (ఫైల్)



ఈమె మొగిలి శిరీష. జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్. సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం దేశాయిపల్లి. శిరీష చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. స్థానిక ఆర్‌ఎంపీ రాజేశం, టీచర్ సత్యనారాయణ శిరీషను 4వ తరగతిలో ట్రస్ట్‌లో చేర్పారు. పదో తరగతి వరకు ట్రస్ట్‌లో చదువుకుని ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ హైదరాబాద్‌లో పూర్తిచేసింది. 2014లో పోలీస్‌కానిస్టేబుల్(సివిల్)గా ఎంపికై ప్రస్తుతం జగిత్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తోంది. భర్త రవి వ్యాపారం చేస్తున్నాడు. హిమజ అనే కూతురు ఉంది. తాను ఈ స్థాయిలో ఉండేందుకు 'రంగినేని' ట్రస్ట్ కారణమని శిరీష గర్వంగా చెబుతోంది.



ఇతను పడకంటి గోవర్ధన్‌చారి. జగిత్యాల జిల్లా రాయికల్. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. సమీప బంధువులు 2004లో సిరిసిల్ల పట్టణ శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో చేర్పించారు. 8వ తరగతిలో చేరిన గోవర్ధన్ ఇక్కడే 10వ తరగతి, ఇంటర్ పూర్తిచేశాడు. 2011లో రాయికల్‌లో వుడ్ కార్వింగ్ షాపు ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఐదు యూనిట్లతో మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. రంగినేని మోహన్‌రావు ప్రేరణతో ఎదిగానని గోవర్ధన్ చెబుతున్నాడు.

ఎదిగిన వారెందరో..

ఆత్మహత్యలకు పాల్పడిన నేతకార్మికుల పిల్లలు, ఎన్‌కౌంటర్ బాధితుల పిల్లలు, అమ్మానాన్నలను కోల్పోయిన చిన్నారులకు కులమతాలకు అతీతంగా ట్రస్ట్‌లో ఆశ్రయం కల్పించారు. ట్రస్ట్‌లోనే అ..ఆలు నేర్చుకున్నారు. వివిధ తరగతుల్లో చేరిన వారు బీటెక్, ఎంటెక్, ఎల్‌ఎల్‌బీ, బీఎస్సీ, పాలిటెక్నిక్, బీఫార్మసీ, ఎంబీఏ చదువుకుని ఉద్యోగాలు సాధించారు. ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లల్లో 35మంది ఉద్యోగాలు, మరో 20 మంది స్వయం ఉపాధి సాధించి జీవితంలో స్థిరపడ్డారు. ఉద్యోగాలు చేస్తున్నవారు తాము సంపాదిస్తున్న జీతంలో కొంత సొమ్మును రంగినేని ట్రస్ట్ నిర్వహణకు అందిస్తున్నారు కేవలం 14 మంది పిల్లలతో మొదలై 2020 నాటికి 224మంది వరకు ఆశ్రయం ఇచ్చింది. కరోనా లాక్‌డౌన్‌తో ట్రస్ట్‌ను తాత్కాలికంగా మూసివేసినా పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



గుజరాత్‌లో జాబ్ చేస్తున్నా



మాది తంగళ్లపల్లి మండలం చింతలఠాణా. తొమ్మిదేళ్ల ప్రాయంలో ట్రస్ట్‌లో చేరాను. ఆరేళ్లు చదువుకున్న. ఇంటర్ సీవీ రామన్ కాలేజీలో చేశాను. ఎంసెట్ రాసి ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ చేశాను. గుజరాత్‌లో లార్సెన్ అండ్ టూబ్రో కంపెనీలో మంచి వేతనంతో పని చేస్తున్నాను.

– గారిపల్లి సందీప్, గుజరాత్

మేమిద్దరం పని చేస్తున్నాం



నేను ట్రస్ట్‌లో పదోతరగతి వరకు చదివాను. హైదరాబాద్‌లో బీటెక్ చేశా. నా చదువులకు ట్రస్ట్ సాయం చేసింది. ఇప్పుడు క్యాప్‌జెమిని కంపెనీలో చేస్తున్న. మా ఆవిడ సౌమ్య టీసీఎస్‌లో చేస్తోంది. మోహన్‌రావు తాతయ్య, వెంకట్‌రావు సారు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించారు.

– తోనుపునూరి యశ్వంత్, వరంగల్

అమ్మానాన్న చనిపోయారు



మాది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం రామవరం. మూడో తరగతిలోనే అమ్మానాన్న లక్ష్మి, గట్టయ్య చనిపోయారు. 2003లో రంగినేని ట్రస్ట్‌లో చేరాను. హైదరాబాద్‌లో పీజీ చేశాను. కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న. గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న. గాయకుడిగా గుర్తింపును రంగినేని ట్రస్ట్ కల్పించింది. ఎన్నో వేదికలపై పాడాను.

– జాతరకొండ సంపత్, రామవరం

పిల్లలు స్థిరపడితే తృప్తి



ట్రస్ట్‌లో చదువుకున్న పిల్లలు ఉద్యోగాలు సాధించి స్థిరపడడం తృప్తిగా ఉంది. నాకు చేతనైన సాయం చేయాలని ట్రస్ట్ పెట్టాను. కరోనాతో ఇబ్బంది ఏర్పడినా మా అబ్బాయి నవీన్, రిటైర్డు హెచ్‌ఎం తూడి వెంకట్రావు, ముత్యంరెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ ప్రతాప్, ట్రస్ట్ సభ్యుల ప్రోత్సాహంతో మళ్లీ తెరిచాం. పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం.

– రంగినేని మోహన్‌రావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు

న్యూస్‌రీల్

సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలకు ఏర్పాట్లు



పెద్దపల్లిరూరల్: సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఈనెల 22 నుంచి 24వరకు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులకు సూచించారు. ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో క్రీడాకారులకు ఇబ్బంది తలెత్తకుండా టెంట్లు, ఫ్యాన్లు, కుర్చీలు, చల్లని తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, డీఈఓ మాధవి, డీఆర్‌డీఓ శ్రీధర్, రంగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తిరుతపతిరావు, రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తదితరులున్నారు.

10న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

మంథని: వచ్చే నెల 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంథని న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి భారతి సూచించారు. మంథని కోర్టులో పోలీస్ అధికారులతో శనివారం సమావేశం అయ్యారు. వివిధ కేసుల్లో రాజీకి సిద్ధపడిన వారు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని, భూతగదాలు, చెక్ బౌన్స్, భార్యాభర్తల కేసుల్లో రాజీమార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు.

నేడు కాగజ్‌నగర్ రూట్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లురద్దు

రామగుండం: సికింద్రాబాద్ రూట్‌లో చర్లపల్లి కోచింగ్ టర్మినల్ పరిధి ఘట్‌కేసర్– చర్లపల్లి మధ్య భూగర్భ వంతెన నిర్మాణ నిమిత్తం ఆదివారం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్–సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇరువైపుల రాకపోకలను రద్దు చేశారు. కాగా ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని రైల్వే అధికారులు ప్రకటించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో

కమాన్‌పూర్(మంథని): మండలంలోని కమాన్‌పూర్, గుండారం, రామగిరి మండలం కలవ్చర్ల, పన్నూర్ గ్రామాల్లో శనివారం పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఆయన వెంట ఎంపీవోలు కాటం భాస్కర్, శేషయ్యసూరి, సర్పంచ్‌లు ఆకుల ఓదెలు, గంట పద్మ, అల్లం పద్మ, పంచాయతీ కార్యదర్శులు నరేష్, శ్రీనివాస్ ఉన్నారు.

కాళేశ్వరం జలాలతో రాష్ట్రం సస్యశ్యామలం

కాల్వశ్రీరాంపూర్: కాళేశ్వరం జలాలతో రాష్ట్రం సస్యశ్యామలం అవుతోందని, పాడిపంటలతో సుభిక్షంగా ఉందని ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వరంగల్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, టీఎస్‌పీఎస్ ఎగ్జామినేషన్, సెలబస్ కమిటీ మాజీ సభ్యుడు బైరి ప్రభాకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అధిక ప్రాముఖ్యం ఇస్తున్నారని తెలిపారు. హుస్సేన్‌మియా వాగు నుంచి వృథాగా వెళ్తున్న నీటిని ప్రత్యేక మోటార్ల ద్వారా రాయపేట ఎత్తిపోతల ద్వారా మండలంలో 40 చెరువులు నింపారని గుర్తు చేశారు. హుస్సేన్‌మియా వాగుపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమకాలువవైపు ఉన్న చెరువులకు నీరు అందించాలని గంగారం గ్రామానికి చెందిన రైతులు ఈద శంకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఈద తెలిపారు. తారుపల్లి సర్పంచు రమేశ్, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్, రిటైర్డ్ హెచ్‌ఎం నార్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా భారత్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల

- కేంద్ర పాడిపరిశ్రమల, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాల

గోదావరిఖని: ప్రధాని నరేంద్రమోదీ కృషితో భారత్ అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర పాడిపరిశ్రమల, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాల తెలిపారు. లోక్‌సభ ప్రవాస్‌యోజనలో భాగంగా శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధి శక్తికేంద్రం, మండల, బూత్ అధ్యక్షులతో మాట్లాడారు. డిజిటల్ రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలపడంలో ప్రధాని కృషి ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. మారుమూల గ్రామ పంచాయతీలకు కూడా నేరుగా నిధులు అందించేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించిందని వెల్లడించారు. మోదీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకుని రాబోయే ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టంపై కేంద్ర ప్రభుత్వం రైతులకు సాయం చేస్తుందన్నారు. రామగుండం నియోజవర్గ కన్వీనర్ పిడుగు క్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్‌వెంకటస్వామి, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, పార్లమెంట్ కన్వీనర్ పి.మల్లికార్జున్, విస్తారక్ కె.సురేష్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

జ్యోతినగర్: దేశంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు కేంద్రమంత్రి సూచించారు. రామగుండంకు వచ్చిన ఆయనకు జ్యోతిభవన్ వద్ద పోలీసులు గౌరవ వందనం చేశారు. అన్నపూర్ణకాలనీలోని మల్కాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్‌కుమార్ ఇంట్లో బ్రేక్ ఫాస్ట్ చేశారు. బూత్ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ ఇంట్లో 49వ బూత్ లెవల్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన విధివిధానాలపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

కేంద్రమంత్రిని కలిసిన మంథని నాయకులు

మంథని: బూత్‌స్థాయి పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రిని శనివారం పార్టీ నాయకులు కలిశారు. మంథని మత్స్యశాఖ అధ్యక్షుడు, ముత్తారం మండల ఇన్‌చార్జి పోతరవేణ క్రాంతి కుమార్, నాయకులు చిలువేరు సతీష్, ఎడ్ల సదాశివ్ ఉన్నారు.

గోదావరి నది తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

గోదావరిఖని: గోదావరి తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది గంగపుత్రులకు జీవనోపాధి కల్పించాలని కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారు. గోదావరి నది సమీపంలో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ మర్యాన్, గోదావరి పక్కనే ఉన్న విశాలమైన స్థలంలో ఆలిండియా టూరిజంతో సర్వే చేయించి టూరిజం డెవలప్‌మెంట్ చేయాలని, తెప్పోత్సవాలను జాతీయ ఫెస్టివల్‌గా ప్రకటించాలని నాయకులు బంగారు సుభాష్, పారిపల్లి రాజలింగం కోరారు.

బల్దియాల్లో 'ట్రిపుల్ ఆర్'

- చెత్తపై సమరం కోసం కార్యాచరణ
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అమలు
- వచ్చేనెల ఐదో తేదీ వరకు 'మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్'
- స్వచ్ఛత కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పోటీలు
- ప్రజలకు అవగాహన కల్పించడంపై పాలకవర్గాల దృష్టి



ట్రిపుల్ ఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ(రామగుండం): రెడ్యూస్.. రీ యూజ్.. రీ సైకిల్... (ట్రిపుల్ ఆర్) విధానం పేరిట నగరపాలక, పురపాలక సంస్థల్లో స్వచ్ఛత పోటీలు నిర్వహించేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ శ్రీకారం చుట్టింది. పారిశుధ్య పనుల నిర్వహణ మెరుగుపర్చడానికి కేంద్రం ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో ఏటా ఈ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో 'మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ్ షహర్' పేరుతో ఇళ్లనుంచి వెలువడే చెత్తను తగ్గించడానికి ట్రిపుల్ ఆర్ విధానాన్ని అమలు చేయనుంది. ఇందుకోసం డివిజన్లు, వార్డుల్లో తాత్కాలికంగా ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. జిల్లాలో రామగుండం కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలికల్లో ఈ ట్రిపుల్ ఆర్ చేపట్టనున్నారు.

రెడ్యూస్.. రీ యూజ్.. రీ సైకిల్..

నగరపాలక, మున్సిపాలిటీల పరిధిలోని గృహాల్లో తడి, పొడి చెత్త సేకరిస్తుండగా.. ఇందులోంచి పొడి చెత్తను తగ్గించేందుకు (రెడ్యూస్).. పొడి చెత్తను తిరిగి వినియోగించడం(రీయూజ్).. పునర్వినియోగం (రీసైక్లింగ్)పై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ట్రిపుల్ ఆర్ పద్ధతి అవలంబించనున్నారు.

రామగుండంలో 15 కేంద్రాలు

ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు, రేకులు, పుస్తకాలు, పేపర్లు, దుస్తులు, చెప్పులు, షూలు, తదితర పొడిచెత్తను సేకరించి ట్రిపుల్ ఆర్ కేంద్రాలకు తరలించనున్నారు. ఈ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. రామగుండం కార్పొరేషన్‌లో ఇప్పటివరకు 15 కేంద్రాలను గుర్తించారు.

ఐదో తేదీ వరకు కార్యక్రమాలు

మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమాలను జూన్ ఐదో తేదీవరకు నిర్వహించనున్నారు. ప్రతి డివిజన్, వార్డుల్లోని మహిళా సంఘాలకు అవగాహన కల్పించి ట్రిపుల్ ఆర్ కేంద్రాలను విజయవంతం చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇప్పటికే కార్పొరేషన్ మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ సుమన్‌రావు దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

ట్రిపుల్ పోటీలకు అవార్డులు

ట్రిపుల్ ఆర్ పోటీలకు తలపడుతున్న నగరపాలక, పురపాలక సంస్థలకు కేంద్రం అవార్డులు ఇవ్వనుంది. ఎక్కువ చెత్త సేకరించిన కేంద్రాల నిర్వాహకులను గుర్తించి జూన్ 5న పర్యావరణ దినోత్సవం రోజున సత్కరించనుంది.

అవగాహన కల్పిస్తాం



పర్యావరణహితంగా జీవన విధానం మల్చుకోవాలనే లక్ష్యంతో మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ్ షహర్ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నం. ట్రిపుల్ ఆర్ కేంద్రాలను డివిజన్లలో ఏర్పాటు చేయాలని ఆదేశించాం. ఉపయోగపడని పాత వస్తువులు ఈ కేంద్రాల్లో అప్పగించాలి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– బంగి అనిల్‌కుమార్, మేయర్, రామగుండం

చెత్త బయటేస్తే చర్యలు



చెత్త బయట పడేసే వారికి జరిమానా విధిస్తాం. ట్రిపుల్ ఆర్ విజయవంతం కోసం 50 డివిజన్లకు 50 మందితో వార్డు ఆఫీసర్లను నియమించాం. మెప్మా ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ నిర్వహిస్తాం. పొడి చెత్తను ట్రిపుల్ ఆర్ కేంద్రాలకు తరలించడంపై రికార్డు మెయింటేన్ చేయిస్తాం.

– బి.సుమన్‌రావు, కమిషనర్, రామగుండం

డీఎంఎఫ్‌టీ నిధులు జిల్లాలోనే వినియోగించాలి

గోదావరిఖని: సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులను జిల్లాలోనే వినియోగించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ డిమాండ్ చేశారు. శనివారం ఓసీపీ–3 ఎస్‌అండ్‌డీ, వకీల్‌పల్లిగని నైట్‌షిఫ్ట కార్మికులను కలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేటుపరం చేయడానికి కుట్రపన్నుతున్నాయన్నారు. కార్మికులకు సొంతింటి కలను నెరవేర్చడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి డబ్బులను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించలేదని, కేసీఆర్ మాత్రం సంస్థ డబ్బులను వాడుకొని కార్మికుల పొట్టకొడుతున్నారని విమర్శించారు. సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులను సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు తరలిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని మరచిన బీఆర్‌ఎస్, బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఎండల నేపథ్యంలో కార్మికుల పని వేళలు మార్చాలన్నారు. ఆయన వెంట నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్లు స్వామి, ఎండీ.ముస్తఫా, సంపత్ రెడ్డి, కే.శ్రీనివాస్, వీరబోయిన రవియాదవ్ పాల్గొన్నారు.



వకీల్‌పల్లిగనిలో కార్మికులతో రాజ్‌ఠాగూర్

జీజీహెచ్‌లో తీరిన విద్యుత్ సమస్య

కోల్‌సిటీ(రామగుండం): జీజీహెచ్‌లో విద్యుత్ సమస్యతో నిలిచిపోయిన వైద్య సేవలను పునరుద్ధరించారు. విద్యుత్ హెచ్చు తగ్గులతో ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్, ఎస్‌ఎన్‌సీయూ, ల్యాబ్ తదితర వైద్యసేవలు నిలిచిపోయాయి. దీంతో శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల వరకు సంబంధిత అధికారులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి, వైద్య సేవలను పునరుద్ధరించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ తెలిపారు. ఆస్పత్రిలో నిర్మించిన నూతన బ్లాక్ కారణంగా ఇతర బ్లాక్‌లకు విద్యుత్ సరఫరా తక్కువగా సరఫరా అవుతోందని, ఆస్పత్రులకు మరో హెవీలోడ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే విద్యుత్ శాఖకు దరఖాస్తు చేశామని పేర్కొన్నారు. ఆస్పత్రి ఆవరణలోని ఆక్సిజన్ ప్లాంట్ దగ్గర నుంచి ప్రత్యేకంగా విద్యుత్ లైన్‌తో విద్యుత్ సరఫరా చేపట్టినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రాంపల్లిలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాంపల్లి శివారులోని కనుకుంట్ల నర్సయ్య పొలంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పదెకరాల పొలంలో పైపులతోపాటు గడ్డి కాలిందని, దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని అంచనావేసినట్లు తెలిపారు. సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్ మండలం జూలపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన వైద్య కొయ్యడ అక్షిత, వైద్య వరుణి, కుమ్మం హర్షవర్ధన్, పెనుకొండ హార్దిక్ నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్- 2022 పరీక్ష డిసెంబర్‌లో నిర్వహించారు. పెద్దపల్లి నుంచి 49మంది విద్యార్థులు ఎంపిక య్యారు. జూలపల్లి పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారు. ఎంపికైన విద్యార్థులు ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ పొందుతారు. విద్యార్థులను హెచ్ఎం కమలాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

22న ప్రజావాణి కార్యక్రమం రద్దు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 22న రద్దు చేసినట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు 22న ప్రారంభం కానున్నాయని, అధికారులు ఆయా కార్యక్రమాలకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

ఇల్లు కొనవద్దని బహిరంగ ప్రకటన

తేది: 20-05-2023.

ఈ ప్రకటన ద్వారా అందరికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటు వెలుముల రాంమోహన్‌రావు గారి తండ్రి: కీ॥శే॥ తిరుపతిరావు గారు తన స్వార్జిత ఆస్తి ఇల్లు, ఇం.నెం. 1-2-52/డి, IMS పాఠశాల దగ్గర పెద్దపల్లి పట్టణం మరియు జిల్లాలో గల ఇల్లుపైన నలుగురికి హక్కు కలదు, కాని ప్రస్తుతం అందులో ఉంటున్నట్టి వెలుముల కీర్తి అను నీవు మా క్లయింటుకు తెలియకుండా అమ్ముటకు ప్రయత్నించుచున్నావు, కానీ సదరు ఆస్తిపైన నీకు ఏలాంటి హక్కు లేదు, ఇది ఉమ్మడి ఆస్తి, నీవు అమ్మకూడదు, ఎవరూ కొనకూడదు, ఒకవేల నీవు అమ్మినను, వేరే వారు కొన్నను అట్టి కొనుగోలు చెల్లదు మరియు మీపై చట్ట ప్రకారం చర్య తీసుకోబడును. ఈ విషయమై కోర్టులో వాటాల కోసము దావా వేయుచున్నాము. మరియు ఈ ఇంటి పైన మీకు ఏ హక్కులు ఉన్నవో మాకు ఈ ప్రకటన తర్వాత 15 రోజులలో చూపగలవు. ఈ క్రింద మా చిరునామా కలదు గమనించగలవు.

ఇట్లు:
సం/- దోనేటి కిష్టయ్య, అడ్వకేట్ & నోటరి
పెద్దపల్లి, సెల్: 9849644640

శాత్రాజ్‌పల్లికి తారురోడ్డు

- నిర్మాణానికి రూ.3.20కోట్లు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు సులువైన మార్గం
- వంతెన పూర్తయితే రెండు జిల్లాలకు రాకపోకలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మానేరులో నడుచుకుంటూ వెళ్తున్న గిరిజనులు

మంథని: గిరి'జనుల' నడక కష్టాలు తీరనున్నాయి. ఏళ్లకాలంగా ఇబ్బందులు పడుతూ మైళ్లకు మైళ్లు నడిచిన ప్రజలకు ఊరట లభించనుంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దులోని ముత్తారం మండలం పారుపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శాత్రాజ్‌పల్లి గిరిజన గ్రామానికి మహర్దశ పట్టనుంది. గ్రామం నుంచి భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకటేశ్వర్‌రావుపల్లి వరకు తారురోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.20కోట్లు మంజూరు చేసింది.

'నడక' యాతనకు చెక్

గ్రామంలో సుమారు 90గిరిజన కుటుంబాలు.. 150మంది వరకు జనాభా ఉంది. ఈ గ్రామం నుంచి అటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు, ఇటు పెద్దపల్లి జిల్లా ముత్తారం వైపు వెళ్లాలంటే కాలినడకే దిక్కు. శాత్రాజ్‌పల్లి మానేరుకు అవతలి వైపు ఉండడంతో రోడ్డు సౌకర్యం లేదు. ప్రతీ అవసరానికి సుమారు 4కిలో మీటర్ల దూరంలో ఉన్న పారుపెల్లికి కాలినడకన రావాల్సిందే. వర్షాకాలం అయితే మానేరు పొంగితే ఇక్కడి ప్రజలకు సంబంధాలు తెగిపోతాయి. ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామానికి ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డు

తగ్గనున్న దూరభారం

జయశంకర్ భూపాలపల్లి జిల్లావైపు రోడ్డు నిర్మాణం పూర్తయితే శాత్రాజ్‌పల్లి వాసులకు దూరభారం తగ్గుతుంది. గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలోనే టేకుమట్ల గ్రామం.. అక్కడి నుంచి భూపాలపల్లికి 20కిలోమీటర్ల దూరం ఉంటుంది. మానేరుపై రూ.47.40కోట్లతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వంతెన అందుబాటులోకి వస్తే ముత్తారం మండలకేంద్రానికి కేవలం పది నిమిషాల్లో చేరుకోవచ్చు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో శాత్రాజ్‌పల్లి గ్రామానికి మంచి రోజులు వచ్చాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హక్కుల కోసం పోరాడితే హతమారుస్తారా?



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

- ఏరియల్ డ్రోన్‌బాంబు దాడులు ఆపాలి
- సభకు అనుమతినిచ్చి అడ్డుకుంటారా
- పౌరహక్కుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిలుక చంద్రశేఖర్, నారాయణ

పెద్దపల్లిరూరల్: సహజసంపదలను కొల్లగొట్టే పెట్టుబడిదారులు, సంపన్నులకే పాలకులు కొమ్ము కాస్తున్నాయని, తమ హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీలను ఏరియల్ డ్రోన్‌బాంబులు వేసి హతమారుస్తున్నారని పౌరహక్కుల సంఘం ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు చిలుక చంద్రశేఖర్, నారాయణ అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడుతూ.. కేంద్రం ప్రజా ఉద్యమాలను అణచివేస్తూ చత్తీస్‌ఘడ్ ఆదివాసీల భూములను బడాబాబులకు కట్టబెట్టి ఖనిజసందపను దోచుకునేందుకు పెసాచట్టం హామీలను ఉల్లంఘించిందని ఆరోపించారు. బీజాపూర్- సుక్మా జిల్లాలోని పామేడ్-కిష్టాపూర్ మధ్య ఉన్న 10గ్రామాలపై జనవరి11న డ్రోన్‌బాంబులు, యుద్ధ హెలికాప్టర్లతో కాల్పులు జరిపి పొత్తంహంగి అనే ఆదివాసీ మహిళను హతమార్చారని ఆరోపించారు. ఏరియల్ డ్రోన్‌బాంబులు, హెలికాప్టర్ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో హాల్‌మీటింగ్ కోసం పోలీసులనుంచి అనుమతి పొందామని, తీరా సమయానికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడాన్ని పౌరహక్కుల సంఘనాయకులు ఖండించారు. నాయకులు వినోద్, పుల్ల సుచరిత, రవికుమార్, రాజేశం, లక్ష్మణ్, రాజన్న, పర్వతాలు, వెంకట్, మహేశ్, సంపత్, రాజలింగు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీకాలేజీలో 'దోస్త్' హెల్ప్‌లైన్



డిగ్రీ కాలేజీలో ప్రారంభించిన దోస్త్ హెల్ప్‌సెంటర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్, తెలంగాణ) హెల్ప్‌సెంటర్‌ను ప్రిన్సిపాల్ లక్ష్మినర్సయ్య, కో-ఆర్డినేటర్ అర్జున్ ప్రారంభించారు. ఇంటర్, పాలిటెక్నిక్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశం పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో నమోదుకు జూన్ 10 వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తులో ఇబ్బందులు వస్తే హెల్ప్‌సెంటర్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

గీత కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

సుల్తానాబాద్‌రూరల్: గీతకార్మికుల హక్కుల కోసం పోరాడాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, నారాయణరావుపల్లిలో గ్రామ కమిటీలను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నారాయణరావుపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా సంపత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌గౌడ్, గొల్లపల్లిలో అధ్యక్షుడిగా అంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. బండారి లక్ష్మణ్‌గౌడ్, గడ్డం అనిల్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్ యూత్‌కాంగ్రెస్ డిక్లరేషన్ స్ఫూర్తిగా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూన్2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ కాంపిటీషన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము అభిలాష్ తెలిపారు. శనివారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్ పొందడానికి సెల్ నంబరు 76618 99899కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ లింకు మొబైల్‌కు వస్తుందని, అందులో వివరాలు నమోదు చేసి 0085 రెఫరల్ కోడ్‌ను నమోదు చేయాలన్నారు. జూన్ 1లోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి జూన్ 2న పరీక్ష ఉంటుందని వివరించారు. నాయకులు ప్రణయ్, రాజు, అనిల్, ప్రశాంత్, విజయ్, సాయిచరణ్, రాహుల్, అరవింద్, హరీశ్ తదితరులున్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

గోదావరిఖని: గోదావరిఖనిలోని గాంధీనగర్‌కు చెందిన రాళ్లదండి సంతోష్(40) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పెళ్లి అయిన తర్వాత విడాకులు ఇవ్వడంతో మద్యానికి బానిసైనట్లు వెల్లడించారు. శుక్రవారం మద్యంతాగి వచ్చి ఇంటి వెనగాల గల మామిడి చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రమేశ్ తెలిపారు.

సాగునీటి ఇబ్బందులు తొలగించండి



ఈఎన్‌సీలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: మంథని నియోజకవర్గంలోని చెరువులకు మరమ్మతు చేయించి పంట భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, నల్లా వెంకటేశ్వర్లుకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సూచించారు. హైదరాబాద్‌లోని జలసాధన కార్యాలయంలో ఈఎన్‌సీలను పుట్ట మధు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాటారం మండలం గూడూరు, బస్వాపూర్, వీరాపూర్, ఒడిపిలవంచ చెరువులతోపాటు మంథని నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత బీడు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించి సాగులోకి తీసుకొచ్చేలా సహకరించాలని కోరారు.

పెద్దపల్లికి చేరిన విజయసంకల్పయాత్ర

పెద్దపల్లిరూరల్: ప్రజలకు ఆర్థిక స్వాతంత్ర్యం రావాలంటూ న్యూ ఇండియా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక స్వేచ్ఛ విజయసంకల్పయాత్ర శనివారం పెద్దపల్లికి చేరింది. ఈనెల ఒకటిన యాత్ర మంచిర్యాల వద్ద మొదలైందని వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు అన్నారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ నెలకు రూ.5వేలు చెల్లించాలని, కుటుంబబంధు పథకం ద్వారా రూ.12లక్షలతో వ్యాపార అవకాశాలను కల్పించాలని కోరారు. నాయకులు లక్ష్మినారాయణ, నర్సయ్య, బబిత, శంకర్, ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడిగా బాబర్ సలీంపాషా



జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ ఎన్సీసీ సభ్యుడిగా ఐఎన్టీయూసీ సీనియర్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషాను నియమిస్తున్నట్లు ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన సీనియర్ జాతీయ నాయకుడు బాబర్ సలీంపాషా అడిషనల్ ఎన్సీసీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. బాబర్ నియామకంపై ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగ గుర్తింపు సంఘం ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ప్రధానకార్యదర్శి కొలిపాక మల్లయ్య, కందులస్వామి, బండారి కనకయ్య, ఆరెపల్లి రాజేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

పాముకాటుతో యువకుడి మృతి

మంథని: మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో కుసుమ రాజేందర్(35) పాముకాటుతో మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో మంచంలోనే తుదిశ్వాస విడిచాడు. శనివారం ఉదయం స్థానికులు గమనించడంతో శరీరంపై పాముకాట్లు ఉన్నాయి. రాజేందర్ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నాడని, మద్యానికి బానిసయ్యాడని, ఇంట్లో విద్యుత్ సరఫరా కూడా ఉండదని, చీకటిగా ఉంటుందని స్థానికులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

బొగ్గుబాయి వార్తలు

క్రీడా దినోత్సవాన్ని ప్రారంభించిన జీఎం



సెంటనరీకాలనీలో క్రీడా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న జీఎం

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం సెంటనరీకాలనీలోని రాణి రుద్రమాదేవి క్రీడామైదానంలో శనివారం క్రీడా దినోత్సవాన్ని ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వరరావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జీఎంలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, క్రీడల నిర్వహణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, ఏరియా క్రీడాకారులు కోల్ ఇండియా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వరరావును ఆత్మీయంగా గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు గౌతం శంకరయ్య, అధికారులు నాగేశ్వరరావు, రఘుపతి, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, క్రీడ గౌరవ కార్యదర్శి మతీన్, ప్రసాద్, వీవీ.గౌడ్, శేషగిరి, శంకర్, భాను, నాగరాజు, రాయమల్లు, సదానందం, రాజేందర్, చంద్రపాల్ పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవంపై సమావేశం



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని: ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై శనివారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో సమీక్షించారు. జీఎం మనోహర్ మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవంపై నెలపాటు అవగాహన, ప్రచారాలు నిర్వహిస్తూ ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. గనులు, విభాగాలు, కాలనీల్లో సమావేశాలు, సైకిల్ ర్యాలీలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, వ్యర్థాల సేకరణ, అధీకృత రీసైక్లింగ్, క్విజ్, సెమినార్, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలి

- జీఎం చింతల శ్రీనివాస్



క్వారీని పరిశీలిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీలో దుమ్ములేవకుండా చర్యలు తీసుకోవాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. శనివారం ఓసీపీ క్వారీని సందర్శించి వ్యూపాయింట్ ద్వారా పనిస్థలాలను పరిశీలించారు. ఫ్రీవేబెన్ పనులు వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ గ్యాలరీల్లో జరుగుతున్న పనులను పరిశీలించి భవిష్యత్‌లో చేపట్టవలసిన ప్రణాళికల గురించి సలహాలు అందజేశారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోల్‌బెంచ్, ఫైర్‌ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. గని పరిసర ప్రాంతాల్లో దుమ్ముధూళి లేవకుండా వాటర్‌స్ప్రేయింగ్ చేయాలని, రక్షణ చర్యలు పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు సీఐటీయూ బహిరంగ సభ



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: ఈనెల 21న గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో సీఐటీయూ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. జీడీకే-11, 1,3 గనులపై శనివారం గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈనెల 21, 22 తేదీల్లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ 16వ రాష్ట్ర మహాసభలు గోదావరిఖని కేంద్రంగా నిర్వహిస్తున్నామని, సభకు యూనియన్ సీనియర్ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేదరి సారయ్య, ఆరెపల్లి రాజమౌళి, దాసరి సురేష్, అన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పని సమయాలు మార్చాలి

కమాన్‌పూర్: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింగరేణి ఆర్జీ-3 పరిధిలోని ఉపరితల గనులలో విధులు నిర్వహించే కార్మికుల పని సమయాలను మార్చాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు గౌతం శంకరయ్య సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఎండలో పని చేసే కార్మికులకు ఏదైనా జరిగితే సహించేది లేదని అన్నారు.

టీబీజీకేఎస్‌లో పలువురి చేరిక



సంఘంలో చేరిన కార్మికులతో ఐలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లి గనిలో టెక్నీషియన్లు శనివారం టీబీజీకేఎస్‌లో చేరారు. ఆర్జీ-2 యైటింక్లయిన్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 15 మంది చేరగా.. వారికి టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ కండువా కప్పి ఆహ్వానించారు. జీఎం కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, పిట్ సెక్రెటరీ మల్లికార్జున్, సతీష్, సంపత్, లింగమూర్తి, సతీష్, నరసింహారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపులో అధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలి



జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: బంగ్లాస్ ఏరియాలో సింగరేణి అధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎంఓఏఐ అధికారుల నాయకులు ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందించారు. సింగరేణేతరులకు కేటాయించిన క్వార్టర్‌లను వారు బదిలీ అయిన తర్వాత అదే డిపార్ట్‌మెంట్ వారికి కేటాయిస్తూ అధికారులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. బదిలీ అయిన సమయంలో తాత్కాలిక నివాసాల్లో గెస్ట్‌హౌజ్‌లో ఉంటూ విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు పొనగోటి శ్రీనివాస్, తదితరులున్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ: అసంఘటిత రంగ కార్మికులు హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ అన్నారు. జిల్లాకేంద్రంలో న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. స్వయం ఉపాధి, చేతివృత్తులు, ఉపాధికూలీలు, హమాలీ అసంఘటిత కార్మికులు తమహక్కులను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు డీవీఎస్ మూర్తి, శంకర్, శ్రీనివాస్, సారయ్య, సభ్యులు కిశోర్, హనుమాన్ సింగ్, శ్రీధర్, నరేశ్, రమేశ్ కార్మికశాఖాధికారి శివరాం, సంఘం నాయకులు సుధాకర్, లింగమూర్తి, నర్సింగం తదితరులున్నారు. గోదావరిఖనిలో అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు కార్పొరేషన్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. లోక్ అదాలత్ మెంబర్ జవ్వాజి శ్రీనివాస్, మిట్టపల్లి శంకర్, మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, బార్ అధ్యక్షులు మేడ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.